వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 153
శుక్రవారం | 15 డిసెంబర్ 2023 | పేజీలు : 08 | వెల రూ. 5



## కుక్కలు కూడా వారి వెంట పడవు

మాజీ ఎమ్మెల్యేలకు సెక్యూరిటీ అవసరం లేదు

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు హాట్ కామెంట్స్

8 లో..




# రూ.500 గ్యాస్‌పై.. గంపెడాశలు



ఈకేవైసీ పేరుతో పడిగాపులు

ఏజెన్సీల వద్ద క్యూ కడుతున్న జనం

సబ్సిడీ గ్యాస్‌పై విధివిధానాలు రాలేదు : డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీలు ఒక్కొక్కటి అమలు చేస్తోంది. ఇప్పటికే మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతోపాటు ఆరోగ్య శ్రీ పథకం ద్వారా రూ.10 లక్షల వరకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్య సదుపాయం పొందే అవకాశాన్ని కల్పించారు. మహాలక్ష్మి పథకంలో భాగంగానే రూ.500 లకే గ్యాస్ పంపిణీ చేస్తామంటూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. దీంతో ఈ కేవైసీ ఉంటేనే సబ్సిడీపై గ్యాస్ లభిస్తుందన్న ప్రచారంతో మహిళలు పెద్ద ఎత్తున గ్యాస్ ఏజెన్సీలవద్ద క్యూ కడుతున్నారు. చలి వణికిస్తున్నా ఏమాత్రం లెక్కచేయకుండా ఏజెన్సీలు తెరుచుకోకముందే బారులు తీరుతున్నారు. సబ్సిడీ గ్యాస్ పై విధివిధానాలు రాలేదంటూ బాధ్యులు చెబుతున్నప్పటికీ ఇవేమీ లెక్క చేయకుండా ఈకేవైసీకే మొగ్గు చూపుతున్నారు. - వరంగల్ వాయిస్, వరంగల్

వివరాలు 2లో..

## సీఎండీగా బాధ్యతలు చేపట్టిన వరుణ్ రెడ్డి

భద్రకాళిలో ప్రత్యేక పూజలు

వరంగల్, హనుమకొండ కలెక్టర్లను కలిసిన కర్నాటి



2లో



8 లో..

## పడిపూజలో సీపీ అంబర్ కిషోర్ ఝా

## మాకు న్యాయం చేయండి

అక్షర చిట్ ఫండ్స్ ఎదుట బాధితుల ఆందోళన



2లో



# రూ.500 గ్యాస్‌పై.. గంపెడాశలు

**ఈకేవైసీ పేరుతో పడిగాపులు**
**ఏజెన్సీల వద్ద క్యూ కడుతున్న జనం**

**సబ్సిడీ గ్యాస్‌పై విధివిధానాలు రాలేదు : డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారికి గ్యాస్ పై ఆశలు పెరుగుతున్నాయి. ఎన్నికల మ్యానిఫెస్టోలో భాగంగా కేవలం రూ.500 లకే గ్యాస్ సిలండర్ అందజేస్తామంటూ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన నేపథ్యంలో ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మ్యానిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.10లక్షల ఆరోగ్యశ్రీ పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ వంద రోజుల్లో అమలు చేసి చూపిస్తామంటూ కాంగ్రెస్ నేతలు ప్రకటిస్తున్నారు. అయితే సబ్సిడీ గ్యాస్ కోసం కేవైసీ తప్పనిసరి అంటూ జరుగుతున్న ప్రచారంతో ఎలాంటి సంబంధం లేదని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు ప్రకటిస్తున్నారు. దీనికి సంబంధించిన మార్గదర్శకాలు, విధి విధానాలు ప్రభుత్వం నుంచి అందాల్సి ఉందంటున్నారు. తొందర పడి ఎవరూ ఇబ్బందులకు గురా కావద్దని సూచిస్తున్నారు.



### ఈ కేవైసీ అంటూ హడావిడి..

అయితే మహాలక్ష్మి పథకంలో భాగంగానే రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందజేస్తామంటూ కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో సబ్సిడీ గ్యాస్ లబ్ధి పొందాలంటే ఈ కేవైసీ తప్పనిసరి అనే ప్రచారం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. డిసెంబర్ 31లోపు ప్రతి ఒక్కరు తప్పని సరిగా ఈ కేవైసీ చేయించాలని, వారికి మాత్రమే సబ్సిడీ గ్యాస్ అందుతుందంటూ ప్రచారం సాగుతోంది. దీంతో నగరంలోని పలు ప్రాంతాల్లోని గ్యాస్ వినియోగదారులు ఈ కేవైసీ కోసం గ్యాస్ ఏజెన్సీలకు పరుగులు పెడుతున్నారు. తెల్లారక ముందే వచ్చి క్యూ కడుతున్నారు. గంటల కొద్ది టైమ్ కేటాయిస్తూ ఈ కేవైసీ చేయించుకుంటున్నారు. పెద్ద ఎత్తున వినియోగదారులు తరలి రావడంతో ఏజెన్సీల వద్ద గందరగోళ పరిస్థితి నెలకొంది.

### ఏజెన్సీలకు వెళ్లాల్సిన అవసరం లేదు..

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.500 లకే గ్యాస్ సిలిండర్ పథకానికి సంబంధించి ఇప్పటి వరకు ఎటువంటి విధివిధానాలు అందలేదని తెలంగాణ ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రకటిస్తున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు చమురు మార్కెటింగ్ కంపెనీల ద్వారా వినియోగదారుల ఇంటి వద్దనే ఈ కేవైసీ తీసుకోవాలని ఆదేశించారని వెల్లడించారు. గ్యాస్ సిలిండర్ డెలివరీ సమయంలో మీ ఇంటికి వచ్చిన బాయ్ ఈ కేవైసీ పూర్తి చేస్తారని సూచిస్తున్నారు. ఏదైనా ఇబ్బంది లేదా సాంకేతిక సమస్య ఉంటేనే మీ సంబంధిత పంపిణీ దారులను సంప్రదించాలంటున్నారు. కేవైసీ పేరుతో ఏజెన్సీలకు గుంపులు గుంపులుగా రావద్దని వేడుకుంటున్నారు. దీని ద్వారా శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## సబ్సిడీ సిలిండర్‌పై సమీక్ష..

త్వరలో మహాలక్ష్మి పథకం కింద రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్ ఇచ్చే అంశంపై సివిల్ సప్లయ్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షించారు. ఈ మేరకు శుక్రవారం సచివాలయంలో పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. రైతుల నుంచి ధాన్యం సేకరణ, రేషన్ దుకాణాల ద్వారా నాణ్యమైన బియ్యం సరఫరా అంశాన్ని కూడా చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటర్ రెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుతోపాటు గుత్తా సుఖేందర్ రెడ్డి, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావ్, సివిల్ సప్లయ్ కమిషనర్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# సీఎండీగా బాధ్యతలు చేపట్టిన వరుణ్ రెడ్డి

**భద్రకాళిలో ప్రత్యేక పూజలు**

**వరంగల్, హనుమకొండ కలెక్టర్‌లను కలిసిన కర్నాటి**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** టీఎస్ ఎన్పీడీసీఎల్ నూతన సీఎండీగా కర్నాటి వరుణ్ రెడ్డి శుక్రవారం బాధ్యత స్వీకరించారు. హనుమకొండలోని సీఎండీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు విద్యుత్ శాఖ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ అండ్ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్పీడీసీఎల్ కంపెనీ కార్యదర్శి ఏడిఈ బక్క దానయ్య, ఉపాధ్యక్షులు రౌతు రమేష్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు బాబు, తౌర్య, కోశాధికారి స్వదేశ్ కుమార్, ఏఈ, హనుమకొండ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్.కుమారస్వామి, వి.కృష్ణ, జనగామ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఇ.కుమారస్వామి, సారయ్య, సిటీ బ్రాంచ్ కన్వీనర్లు ఆర్.చలపతి, గుట్టం శ్యామ్ కుమార్, వివిధ డివిజన్ల అధ్యక్ష, కార్యదర్శులు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం వరంగల్, హనుమకొండ కలెక్టర్లు పి.ప్రావీణ్, సిక్తా పట్నాయక్ లను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సీఎండి వరుణ్ రెడ్డికి కలెక్టర్లు అభినందనలు తెలిపారు.

### అమ్మవారికి పూజలు..

వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధి గాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానాన్ని నీపీడీసీఎల్ సీఎండీ కె.వరుణ్ రెడ్డి సందర్శించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి శేషుభారతి, దేవాలయ ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు, వేద పండితులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఆదిశంకరులు, వల్లభ గణపతిని దర్శించిన అనంతరం ఆలయంలోకి విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజానంతరం వరుణ్ రెడ్డికి అర్చకులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేష వస్త్రములు బహుకరించి ప్రసాదం అందచేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈఈ, ఏఈఈలు, మండువ శేషగిరి రావు తదితరులు పాల్గొన్నారు.

# మాకు న్యాయం చేయండి

**అక్షర చిట్ ఫండ్స్ ఎదుట బాధితుల ఆందోళన**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ పట్టణ కేంద్రంలోని అక్షర చిట్ ఫండ్స్ యాజమాన్యం రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది ఖాతాదారుల నుంచి కోట్లాది రూపాయల చిట్టీలు వేయించి అవి పూర్తయినప్పటికీ డబ్బులు చెల్లించకుండా ఇబ్బందుకు గురి చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం నక్కలగుట్టలోని అక్షర చిట్ ఫండ్స్ ప్రధాన కార్యాలయం ఎదుట లబ్ధిదారులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఈ విషయమై స్థానిక చిట్ ఫండ్స్ రిజిస్ట్రార్ కు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి నిర్లక్ష్యం కారణంగానే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. యాజమాన్యాలు ఇచ్చే డబ్బు మూటలకు అధికారులు కక్కుర్తి పడి చూసీ, చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అక్షర చిట్ ఫండ్స్ రాష్ట్ర వ్యాప్తంగా రూ.50 కోట్లకు పైగా మోసం చేసిందని ఆరోపించారు. ఇంత జరుగుతున్నా జిల్లా అధికారులు కనీసం చిట్ ఫండ్ యాజమాన్యంతో మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 100కుపైగా బాధితులు పాల్గొన్నారు. రంగప్రవేశం చేసిన పోలీసులు బాధితులతో చర్చలు జరిపి వారిని శాంతింపజేశారు.

# మంత్రులను కలిసిన కేటీపీపీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** గణపురం మండలం కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ ఉద్యోగులు ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, గిరిజన శాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూర్య సీతక్కను ఐటీ శాఖ, అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబును సచివాలయంలోని వారి ఛాంబర్లలో కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువా, బొకేలు, వారి చిత్రపటాలను అందించి ఘనంగా సన్మానించారు. తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ 202/10 అధ్యక్షుడు ఆరెపల్లి మోహన్, వ్యవస్థాపకులు సెక్రటరీ జనరల్ మాతంగి శ్రీనివాస్, అలాగే కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు మోరె కుమార్, బొమ్మకంటి రాజేందర్, తిరుపతి, సంపత్, సాయన్న, రమేష్ తదితరులు ఈ సందర్భంగా విద్యుత్ సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు వారికి తెలియజేశారు. దీంతో వారు సానుకూలంగా స్పందించి త్వరలోనే మీ సమస్యలు పరిష్కారం అయ్యేలా చేస్తామని హామీ ఇచ్చారు.

# ప్రభుత్వ ఆఫీసులలో సీఎం రేవంత్ రెడ్డి ఫొటో పెట్టండి



**వరంగల్ వాయిస్, పరకాల :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మన తెలంగాణ రాష్ట్రానికి నూతనంగా గత వారం రోజుల కిందట నూతనంగా ముఖ్యమంత్రిగా శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. తద్వారా ముఖ్యమంత్రి చిత్రపటాలను ఇంతవరకు కొన్ని ప్రభుత్వ కార్యాలయంలో ఏర్పాటు చేయలేదని, అధికారులు నిర్లక్ష్య ధోరణి వహిస్తున్నారని, వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటాలను ఏర్పాటు చేసేలా సంబంధిత రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధికారులు చర్యలు చేపట్టాలని, పరకాల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు బొమ్మకంటి చంద్రమౌళి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిపోయి రోజులు గడుస్తున్నా ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు ముఖ్యమత్రి రేవంత్ రెడ్డి ఫొటోలు ఎక్కడ ఏర్పాటు చేయలేదని, సంబంధిత అధికారులు స్పందించి ఇప్పటికైనా ఆయా ప్రభుత్వాల కార్యాలయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫొటోలను ఏర్పాటు చేయాలని కోరారు.

# దుర్గామాతకు మొక్కుల చెల్లింపు



**వరంగల్ వాయిస్, దేవరుప్పుల :** మండలంలోని సీతారాంపురం గ్రామంలో మామిడాల యశస్విని రెడ్డి గెలుపును కోరుతూ గత నెలలో దుర్గామాత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అందులో భాగంగానే భారీ మెజారిటీతో యశస్విని రెడ్డి గెలుపొందగా ఇచ్చిన మాట ప్రకారమే శుక్రవారం గ్రామ సర్పంచ్ రెడ్డిరాజుల రమేష్,గ్రామపార్టీ అధ్యక్షుడు వరికెల రతన్,చీమల బీరయ్య,తదితర నాయకులు దుర్గామాతకు మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్ది క్రిష్ణామూర్తి గౌడ్, బీసీసెల్ అధ్యక్షుడు కాడబోయిన గణేష్, మండల యూత్ అధ్యక్షుడు బోనగిరి యాకస్వామి, మాజీ బీసీ సెల్ అధ్యక్షుడు కాడబోయిన వెంకన్న, బస్వ సోమన్న, ప్రవీణ్, జహంగీర్, ఎలుకపల్లి నాగరాజు, కాంటరీ హరీష్, రెడ్డిరాజుల యాకన్న, చింత శ్రీకాంత్, భాస్కర్, నిమ్మల గణేష్, తోలుపునూరి వెంకటయ్య, మాసంపల్లి సాత్విక్ పటేల్, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ జాంగోన్ జిల్లా, గ్రామ యూత్ అధ్యక్షుడు పైండ్ల అనిల్, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రూ.2లక్షల రుణమాఫీ అమలైతే గ్రామాలన్నీ కాంగ్రెస్ మయం





**వరంగల్ వాయిస్, పరకాల :** ఇప్పటికే పార్టీలకతీతంగా కాంగ్రెస్ కు తెలంగాణ రైతులు పట్టం కట్టారు. పరకాల తెలంగాణ ప్రాంతంలో అత్యధికంగా రైతులు ఉండడం, గత ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయకపోవడంతో ఆ పార్టీకి వ్యతిరేకంగా రైతులు కాంగ్రెస్ పార్టీని గెలిపించుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల ముందు రైతులకు రెండు లక్షల రుణమాఫీ అని సంకేతంత ఇవ్వడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం రుణమాఫీ పేరు చెప్పి పది సంవత్సరాలైనా రుణమాఫీ చేయకపోవడంతో రైతులందరూ గత ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ. 2లక్షల రుణమాఫీని ఒకేసారి మాఫీ చేద్దామని ఎన్నికల సమయంలో చెప్పడంతో రైతులందరూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గెలిపించుకున్నారు. ప్రస్తుతం రెండు లక్షల రుణమాఫీ జరిగితే గ్రామ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి ఏ పార్టీ పోటీ రాదనే విషయం గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ముఖ్యంగా గ్రామాలలో పార్టీలకతీతంగా రైతులందరూ రుణమాఫీకే కట్టుబడి ఉన్నారనేది జగమెరిగిన సత్యం. ఒకవేళ స్థానిక సంస్థలకు ముందే రుణమాఫీ జరిగితే గ్రామాలలో ఏ పార్టీ కూడా కనపడకుండా అన్ని పార్టీలు మాయమై గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలుగా గెలుపొందే అవకాశం పుష్కలంగా కనపడుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా దాన్ని తగ్గట్టుగానే రైతులకు రైతు భరోసా ఎకరాకి రూ. 10000 చొప్పున మంజూరు చేయడం జరిగింది. రైతు రుణమాఫీ కూడా కార్యచరణ చేపట్టే అవకాశం ఉంది. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించే పార్టీలు తెలంగాణలో లేవనేది ప్రజలందరూ చర్చించుకుంటున్నారు.

# జాతీయ సమైక్యతకు సర్దార్ పటేల్ ఎనలేని కృషి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** భారత మాజీ ఉప ప్రధాని, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం తొర్రూరులో బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన వారి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు, జనగామ జిల్లా ఇంఛార్జి యాప సీతయ్య మాట్లాడుతూ దేశంలో స్వాతంత్ర్య అనంతరం చీలికలు, పీలికలుగా ఉన్న సంస్థానాలను దేశంలో విలీనం చేసి జాతీయ సమైక్యత కోసం కృషి చేసిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని కొనియాడారు. 565 సంస్థానాల ను భారత దేశంలో విలీనం చేసిన ఉక్కు మనిషి సర్దార్ పటేల్ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న ప్రధాని నరేంద్ర మోడీ ఏక్ భారత్ -శ్రేష్ఠ భారత్ అనే నినాదంతో ముందుకు సాగుతున్నారని తెలిపారు. నిజాం నిరంకుశ పాలనలో ఉన్న తెలంగాణ ప్రజలకు ఉక్కు మనిషి సర్దార్ పటేల్ నిజాం మెడలు వంచి విముక్తి కల్పించారని తెలిపారు. సర్దార్ పటేల్ స్ఫూర్తితో ప్రతీ ఒక్కరూ జాతి సమైక్యత కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ తొర్రూరు శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్, జిల్లా, మండల నాయకులు మంగళపల్లి యాకయ్య, పైండ్ల రాజేష్, కాగు నవీన్, జలగం రవి, నర్కుటి ఛలపతి రాజ్, గంధం రాజు, నూకల నవీన్, శివసాయి, తూర్పాటి రమేష్, సర్వి వెంకటేష్, నాగేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రస్తుత కాలంలో వింత వింత రోగాలతో బాధపడుతున్న వారికి ప్రభుత్వం తరఫున నిపుణులైన డాక్టర్లచే వైద్య పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులు అందజేస్తున్నారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి సూచించారు. శుక్రవారం ఎస్ఆర్ఆర్ తోట ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ అనిత ఆధ్వర్యంలో డివిజన్ లోని ఉర్సు ప్రతాప్ నగర్ లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్లు 112 మందిని పరీక్షించగా రోగులకు కార్పొరేటర్ మరుపల్ల రవి మందులను అందజేశారు. ఎస్ఆర్ఆర్ తోట ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ అనిత మాట్లాడుతూ నేటి రోజులలో అనేకమంది బీపీ, షుగర్, థైరాయిడ్, మలేరియా జ్వరాలతో బాధపడుతున్న వారికి హెల్త్ సెంటర్ల లో ఉచితంగా రక్త పరీక్షలను నిర్వహించి మందులను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఏదైనా శారీరకంగా ఇబ్బందులు ఎదుర్కొంటే వెంటనే హెల్త్ సెంటర్ విచ్చేసి వైద్యం పొందాలని కోరారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్ అనిత, స్టాఫ్ నర్స్ మంజుల, ఏఎన్ఎం అనిత, ఎంఎన్ఓ ప్రభాకర్, ఆశావర్కర్లు అనిత, సుధారాణి, కృష్ణవేణి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు వగిలిశెట్టి అనిల్ కుమార్, మరుపల్ల రవి, వంగరి సురేష్, ఎండీ సమీనా, రవి, జవాన్ ప్రశాంత్ పాల్గొన్నారు.

# రేగడి మట్టి అక్రమ వ్యాపారాన్ని అరికట్టాలి

## ఇరిగేషన్, తహసిల్దార్, పోలీస్ శాఖ అధికారులకు ఫిర్యాదు




**వరంగల్ వాయిస్, మరిపెడ :** మండలంలోని అబ్బాయి పాలెం గ్రామంలో రేగడి మట్టి అక్రమ వ్యాపారాన్ని అరికట్టాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు జినక ఉపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మరిపెడ మండల కేంద్రంలో రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు జినక ఉపేందర్ మాట్లాడుతూ అబ్బాయి పాలెం గ్రామ వార్డు మెంబర్ కట్ట రవీందర్ జేసీబీతో అక్రమాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. గత ఎండాకాలంలో ఖరీదు కుంట చెరువు నుంచి రేగడి మట్టి గోడ తండాలో అక్రమంగా నిలువజేసి ఆ మట్టిని ఇటుక బట్టీల వ్యాపారులకు అమ్ముతున్నారని ఉపేందర్ ఆరోపించారు. ఒక ట్రాక్టర్ కు రూ. 1800ల చొప్పున ఇటుక బట్టీ వ్యాపారులకు అమ్ముకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. తక్షణమే అధికారులు స్పందించి ఈ అక్రమ వ్యాపారాన్ని అరికట్టాలని ఉపేందర్ కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జినక వీరయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ జినక యాక స్వామి, షరీఫ్, చిన్నా ఉప్పీ, అలవాల శ్రీనివాస్, బోడ సోమన్న, బోడ బాలు, తదితరులు ఉన్నారు.

# బీఆర్టీయూ నుంచి సీఐటీయూలో చేరికలు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి హాస్పిటల్ జీఎంహెచ్ లో పనిచేస్తున్న 60మంది శానిటేషన్ పేషంట్ కేర్ సెక్యూరిటీ గార్డ్స్, కార్మికులు శుక్రవారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు మెట్టు రవి ఆధ్వర్యంలో సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల నుంచి బీఆర్టీయూ సంఘం సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని అన్నారు. కార్మికులకు వేతనాలు పెంచలేదని, కార్మికుల సమస్యలపై నిత్యం పోరాటం చేసే సీఐటీయూలో చేరడం ద్వారా తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే ఉద్దేశంతో చేరినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ మాట్లాడుతూ సీఐటీయూ ఐక్య పోరాటం నినాదంతో సమస్యల మీద నిరంతరం రాజీలేని పోరాటాలు చేస్తూ అనేక విజయాలు సాధించిందని తెలిపారు. కార్మికులు చేరడం సంతోషకరమన్నారు. రాబోయే కాలంలో కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కోసం ఐక్య పోరాటాలను చేస్తామని రమేష్ పేర్కొన్నారు. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనాలు ఇస్తూ కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

**నూతన కమిటీ ఎన్నిక..**

తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ జీఎంహెచ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. గౌరవాధ్యక్షుడిగా మెట్టు రవి, చీఫ్ అడ్వైజర్ గా రాగుల రమేష్, అధ్యక్షురాలు కే కళావతి, ప్రధాన కార్యదర్శి ఏ అనిల్, వర్కింగ్ ప్రెసిడెంట్ టి. పుష్పమాల, ఉపాధ్యక్షురాలుగా ఇమ్మడి విమల, నిమ్మల కోమల, ఎస్ తిరుపతి, సహాయ కార్యదర్శులు వీరమ, షేక్ సాబేర, కోశాధికారి ఏ రాజేష్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా స్వరూప, అనిల్, విజయ్ కుమార్, సంపత్, రాజు, అశోక్, పద్మలతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

## ప్రమోద్ గౌడ్‌కు సన్మానం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ డీఎంహెచ్ఓ ఛాంబర్‌లో వరంగల్ ఆఫీస్ సూపరింటెండెంట్ మంచిక ప్రమోద్ గౌడ్‌ను ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర జనరల్ సెక్రటరీ రామ రాజేష్ ఖన్నా , శ్యామ్ గౌడ్ మర్యాద పూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువా సత్కరించారు.

## విద్యార్థులకు మహిళల చట్టాలపై అవగాహన



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వాగ్దేవి ఫార్మసీ కళాశాల విద్యార్థులకు మహిళల చట్టాలు, హక్కులపై, సమాజంలో ఎదురవుతున్న ఇబ్బందులు, వాటి నుంచి బయటపడడానికి సంబంధిత శాఖల ద్వారా తీసుకోవాల్సిన సహాయ సహకారాలపై అవగాహన శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. వాగ్దేవి ఫార్మసీ కాలేజ్, బొల్లిగుంటలో ఆ కళాశాల ప్రిన్సిపల్ సహకారంతో సఖి సెంటర్, షీ టీమ్స్ వారి ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించగా దీనికి ముఖ్య అతిథులుగా ఏసీపీ మామునూరు సతీష్ బాబు, రిటైర్డ్ ప్రిన్సిపల్ గవర్నమెంట్ లా కాలేజ్ విజయలక్ష్మి, షీ టీం ఎస్సై విద్యాసాగర్, జెండర్ ఎక్స్పర్ట్ ఇందిర, సఖి సెంటర్ అడ్మినిస్ట్రేటర్ వల్లే శ్రీలతలు పాల్గొని వారి అమూల్యమైన సందేశాలను ఇచ్చారు. అలాగే ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్ స్పెక్టర్లు మామునూరు క్రాంతి కుమార్, శ్రీనివాస్ పర్వతగిరి పాల్గొని విద్యార్థులకు వారి వారి సందేశాలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వాగ్దేవి ఫార్మసీ కాలేజ్ ఫ్యాకల్టీ, 300మంది విద్యార్థులు, సఖి సెంటర్ సిబ్బంది, షీ టీమ్స్ సభ్యులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనంలో నాణ్యమైన ఆహారం అందించాలి



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** చిగురుమామిడి మండలంలోని నవాబ్ పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను స్థానిక జడ్పీటీసీ సభ్యుడు గీకురు రవీందర్ ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం పిల్లలతో కలిసి తిని పరీక్షించారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు రిజిస్టర్ పరిశీలించారు. అనంతరం జడ్పీటీసీ సభ్యుడు గీకురు రవీందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. మన ఊరు మనబడి కార్యక్రమంతో మౌలిక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవన్నారు. విద్యాబోధన విద్యార్థుల ప్రగతి పై దృష్టి కేంద్రీకరించి ప్రతినెల మూడో శనివారం పీటీఎం కార్యక్రమాన్ని చేపట్టాలని రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. పేరెంట్ టీచర్ సమావేశాలలో విద్యార్థుల విద్యా, మానసిక సామర్థ్యాలను పిల్లల తల్లిదండ్రులకు తెలియ చెప్పాలన్నారు. పరిసరాలు, మూత్రశాలల పరిశుభ్రతను పాటించాలన్నారు. పాఠశాల అభివృద్ధిలో గ్రామపంచాయతీ పాలకవర్గం, విద్యా కమిటీ సభ్యులు ఉపాధ్యాయులు, స్వయం సహాయక గ్రూపుల సభ్యులు భాగస్వామ్యులు కావాలని సూచించారు. విద్యార్థుల కోరిక మేరకు పదో తరగతి ప్రత్యేక క్లాసులకు హాజరయ్యే వారికి అక్షర ఫౌండేషన్ నుంచి అల్పాహారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ బోయిన్ పద్మ, ప్రధానోపాధ్యాయులు రాజయ్య, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు ఠాకూర్ నరేందర్ సింగ్, బోయిన వంశీకృష్ణ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఠాకూర్ రానా ప్రతాప్ సింగ్, బోయిని వేణు గోపాల్, కాంగ్రెస్ నాయకులు పిల్లి తిరుపతి, బోయిని విజయ్ కుమార్, ఎన్నం నిఖిల్ పాల్గొన్నారు.

## అన్యాక్రాంతమైన భూమిని స్వాధీన పర్చుకోవాలి



**వరంగల్ వాయిస్, మరిపెడ :** మండల కేంద్రంలో పౌరసరఫరాల సంస్థకు కేటాయించిన గోదాం భూమి అన్యాక్రాంతమైందని, ఆ భూమిని స్వాధీన పర్చుకోవాలని సీపీఐ మరిపెడ మండలం కార్యదర్శి మారగాని బాలకృష్ణ తహశీల్దార్ కు వినతి పత్రాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2007లో సర్వే నెంబర్ 295/2 పౌర సరఫరాల సంస్థకు ఎకరం రెండు గుంటల భూమిని ఇచ్చారని, కొందరు దళారులు అన్యక్రాంతంగా భూమిని ఆక్రమించుకొని పహరీని ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. అధికారులు వెంటనే భూమి హద్దులు నిర్ణయించి, పూర్తి స్థాయిలో సర్వే చేసి అన్యాక్రాంతమైన భూమిని పౌరసరఫరాల సంస్థకు అప్పగించాలన్నారు. మండల సహాయ కార్యదర్శి ఎండీ అబ్దుల్ రషీద్, యాకన్న, దయాకర్, వెంకన్నలు ఉన్నారు.

## వికలాంగుల సంక్షేమ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి

### వికలాంగు జాక్ కన్వీనర్ నల్లెల్ల రాజయ్య



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ నిర్వహించిన అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర వ్యాప్తంగ వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిర్వహించిన సమావేశంలో వి–జాక్ కన్వీనర్ నల్లెల్ల రాజయ్య హాజరై మాట్లాడారు. ప్రస్తుతం కొలువు దీరిన ప్రజా ప్రభుత్వం వికలాంగుల సంక్షేమ కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. అంతే గాకుండా గత ప్రభుత్వం చూపిన వివక్షతను ప్రధానంగా ఏండ్ల తరబడి మహిళా, శిశు సంక్షేమ శాఖలో విలీనమైన వికలాంగుల సంక్షేమ శాఖను వి–జాక్ దశల వారీ పోరాటాల వల్ల వికలాంగుల సంక్షేమ శాఖ విభజన జరిగి నేటికి సంవత్సరం గడిచినా ఇంతవరకు సొంత కార్యాలయాలను ఏర్పాటు చేయకపోవడం విచారకరమన్నారు. ప్రస్తుత నూతన ప్రజా ప్రభుత్వం వికలాంగుల సంక్షేమం దృష్ట్యా ప్రతి జిల్లాలో ప్రత్యేక వికలాంగుల సంక్షేమ కార్యాలయాల ఏర్పాటుతో సహా కార్యాలయ ఉద్యోగులైన ఏడీ, సిబ్బందిని వికలాంగులతోనే భర్తీ చేయాలని కోరారు. ఆరేండ్లుగా పెండింగులో ఉన్న బ్యాక్ లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేసి నిరుద్యోగ వికలాంగుల జీవితాల్లో వెలుగులు నింపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బి.ధనుంజయ్ కుమార్, సయ్యద్ అసద్, ధనుంజయ్, మహేందర్, వీరన్న, నరేశ్, ఉప్పలయ్య, శ్రీనివాస్, నాగరాజు పాల్గొన్నారు .

## ఎస్సీ వర్గీకరణ ఉద్యమం బలోపేతం చేయాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ శాగంటి రమేష్ మాదిగ అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని నూతన కూరగాయల మార్కెట్ ఆవరణలో శుక్రవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎంఎస్పీ మహబూబాబాద్ జిల్లా ఇంచార్జి బిర్రు మహేందర్ మాదిగ పాల్గొని మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రతి గ్రామ, మండలంలో నూతన కమిటీలు వేయాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. వర్గీకరణ చివరి ఘట్టంలో మాదిగలందరూ ఉద్యమంలో పాల్గొని ఉద్యమాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. దుప్పెల్లి అనిల్ మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి , వీహెచ్ పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలేపాక శంకర్, ఎంఎంఎస్ మహిళ జిల్లా అధ్యక్షురాలు కత్తుల రేణుక, ఎంఎస్పీ సీనియర్ నాయకులు పాసం సాంబయ్య, జిల్లా నాయకులు కంది పాటి భిక్షపతి మాదిగ, పెద్ద మముల అంజి బాబు మాదిగ, మిడతపల్లి యాకయ్య మాదిగ, తీగల ప్రేమ్ సాగర్ మాదిగ, ఇరుగు రవి మాదిగ, కొమిరె రమేష్, నాయకురాలు కుంట రజిత, మంద సావిత్రి, కొప్పుల పుష్ప పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి

### 20న మండల సోషల్ ఆడిట్

### జిల్లా గ్రీవెన్స్ ఆఫీసర్ బెస్త అదాం



**వరంగల్ వాయిస్, మరిపెడ :** ఉపాధి పనులు ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన పేదలకు ఉపాధి లభిస్తుందని కూలీలు ఉపాధి హామీ పనిని సద్వినియోగం చేసుకోవాలని మహాత్మా గాంధీ రూరల్ ఎంప్లాయిమెంట్ స్కీం జిల్లా గ్రీవెన్స్ ఆఫీసర్ బెస్త ఆదాం అన్నారు. శుక్రవారం మండలంలోని అబ్బాయి పాలెం గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి పథకం సోషల్ ఆడిట్ గ్రామసభ సర్పంచ్ జినక మణి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బెస్త ఆదాం పాల్గొని మాట్లాడుతూ ఈ గ్రామంలో ఉపాధి పనులు కోసం సంవత్సరానికి కోటి రూపాయలు ప్రతిపాదనలు పంపిస్తుండగా దానికి తగిన విధంగా పనులు కల్పించలేకపోయారని, గ్రామస్థాయిలో ఉపాధి సిబ్బందిపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. 2020 డిసెంబర్ నుంచి 2023 డిసెంబరు వరకు రూ.3కోట్ల విలువ గల పనులు కల్పించవలసి ఉండగా కేవలం రూ.83లక్షల పనులు మాత్రమే లేబర్ చేసినట్లు రికార్డుల ద్వారా తెలుస్తుందన్నారు. ప్రజలు పని కావాలని దరఖాస్తు చేసుకోకపోవడంతో అవగాహన లోపంతో ఉపాధి కోల్పోయారన్నారు. పేద రైతుల కూలీలకు వ్యవసాయ పంట పొలాల్లో పనిచేయుటకు ఉపయోగించుకోని పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ నెల 20న మరిపెడ మండల కేంద్రంలో మండల సోషల్ ఆడిట్ సభ నిర్వహిస్తున్నారని తెలిపారు. గ్రామ సామాజిక తనిఖీ సభలో డీఆర్పీ అనిల్, పంచాయతీ కార్యదర్శులు నిరోషా, ఎం శ్రీలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్ రాయల రవి, కారోబార్ అలవాల యాదగిరి, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి సీతక్కను కలిసిన బొల్లు రమేష్ కుమార్



వరంగల్ వాయిస్, హైదరాబాద్ : ప్రజా సేవకురాలు, తెలంగాణ రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి , మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ధనసరి అనసూయ (సీతక్క)ను శుక్రవారం హైదరాబాద్ లో వారి నివాసంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బొల్లు రమేష్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతక్కకు మంత్రి పదవి రావడం ములుగు జిల్లా ప్రజల అదృష్టమన్నారు. జిల్లాలోని అన్నీ గ్రామాల సర్వతోముఖాభివృద్ధి సీతక్కతోనే సాధ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పబ్బోజు నరసింహ చారి, షేక్ అయ్యూబ్ పాషా, యువజన నాయకులు బొల్లు నాగేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి పొంగులేటిని కలిసిన ఎమ్మెల్యే నాయిని



వరంగల్ వాయిస్, హనుమకొండ : రెవెన్యూ, హౌసింగ్ అండ్ పబ్లిక్ రిలేషన్ శాఖ మంత్రిగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పదవీ బాధ్యతలు తీసుకున్న తరుణంలో శుక్రవారం హైదరాబాద్ లోని ఆయన ఛాంబర్ లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి ఈవీ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాములుకు ఘన నివాళులు




వరంగల్ వాయిస్, హసన్ పర్తి : భాష ప్రయుక్త రాష్ట్రాలకు స్ఫూర్తి పొట్టి శ్రీరాములు అని, ఆయన చూపించిన అహింసాయుత, శాంతియుత , నిరాహార దీక్షలు ఎన్నో ఉద్యమాలకు మార్గదర్శంగా నిలిచాయని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చకిలం రాజేశ్వరరావు అన్నారు, వాసవి క్లబ్ అధ్యక్షుడు చీదర కరంచంద్, అధ్యక్షత నిర్వహించిన పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చకిలం రాజేశ్వరరావు పాల్గొని పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ గాంధీజీ అడుగుజాడల్లో స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం గడిపిన మహనీయుడని, ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించిన మహనీయుడని కొనియాడారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నోటు బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సునీత, క్లబ్ కార్యదర్శి వంచన శ్యాంసుందర్, చిదర పురవర్ధన్ , అప్పని శంకర్, నాగమల్ల సుధీర్, వెలగందల భీష్మనాదం, నాగమల్ల మాధవ శంకర్ పాల్గొన్నారు.

## దేవతా విగ్రహ ప్రతిష్ఠాపన



వరంగల్ వాయిస్, కాజీపేట : హనుమకొండ జిల్లా కాజీపేట సోమిడి గ్రామంలో గల శ్రీ సోమేశ్వర రజక సహకార సంఘం వారు నిర్వహిస్తున్న సీతాలమ్మ మాదేల్లయ్య, ఈరమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మూడు రోజులపాటు జరుపబడేటువంటి ఈ కార్యక్రమాల్లో శుక్రవారం గణపతి పూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణ, నాంది, అగ్ని ప్రతిష్ఠ , మంటపాస్థిత దేవతా పూజలు, గ్రామ ప్రధాన పురోహితులు అయినవోలు వెంకటేశ్వర శర్మ పర్యవేక్షణలో గ్రామ పురోహితులు అయినవోలు రాధాకృష్ణశర్మ నిర్వహణలో ఐనవోలు సాయికృష్ణశర్మ, వేద పండితులు ఏళ్ళంబట్ల క్రాంతికుమార్ శర్మ, తిగుళ్ల శ్రీనివాస్ శర్మ, ఎల్లంబట్ల రవీందర్ శర్మ, కందికోట శ్రీనివాస్శర్మ, వేణుగోపాల్ స్వామి, శివంత్రిపాఠి, హర్షితశర్మ బ్రాహ్మణుల పర్యవేక్షణలో జరిగాయి. అనంతరం భక్తులకు హారతి, తీర్థ ప్రసాద, అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు, కుల పెద్దలు, భక్తులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆత్మవిశ్వాసంతో దివ్యాంగులు రాణించాలి

### జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



వరంగల్ వాయిస్, హనుమకొండ : ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ విభిన్న రంగాల్లో దివ్యాంగులు రాణించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం హనుమకొండలోని అంబేద్కర్ భవన్ లో జిల్లా మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని దివ్యాంగులకు జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ఇటీవల వివిధ క్రీడాంశాల్లో పోటీలను నిర్వహించగా బహుమతులు, ప్రశంసా పత్రాల ప్రదానోత్సవం అంబేద్కర్ భవన్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ జీవితంలో అనేక సవాళ్లు ఎదురవుతుంటాయని, వాటిని ధైర్యంగా ఎదుర్కొంటూ ముందుకు సాగాలన్నారు. మనో సంకల్పం ముందు శారీరక అవరోధం కాదని, సంకల్ప సిద్ధి, మనో ధైర్యమే విజయానికి సాధనాలని పేర్కొన్నారు. పలువురు చిన్నారులు తమ సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. పలు సినీ గీతాలకు నృత్యాలు చేసి అందరిచేత అభినందనలు అందుకున్నారు. మల్లికాంబ మనో వికాస కేంద్రం చిన్నారులు దేవుళ్ళు చిత్రంలోని మీ ప్రేమ కోరే చిన్నారులం, అదే విధంగా దేవత చిత్రంలోని వెల్లువచ్చే గోదారమ్మా తదితర సినీ గీతాలకు నృత్యం చేసి ఆకట్టుకున్నారు. శ్రీ వెంకటేశ్వర బధిరుల పాఠశాలకు చెందిన చిన్నారి ఓం నమో వెంకటేశాయ చిత్రంలోని వేయి నామాలవాడ వెంకటేశుడా గీతానికి అద్భుతంగా నృత్యం చేశారు. దివ్యాంగులకు పరుగు, చెస్, క్యారమ్స్, షాట్ పుట్, జావెలిన్ త్రో, తదితర పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటిన చిన్నారులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను కలెక్టర్ సిక్తా పట్నాయక్ అందజేశారు. జిల్లా సంక్షేమ అధికారి కె. మధురిమ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ శ్రీనివాస్ కుమార్, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ అనితా రెడ్డి, బీడబ్ల్యూ కార్యాలయ సూపరింటెండెంట్ లక్ష్మీకాంత్ రెడ్డి, దివ్యాంగుల సంఘం ప్రతినిధులు నల్లెల్ల రాజయ్య, ధనుంజయ్ కుమార్, రామకృష్ణ, అనిల్ కుమార్, నెహ్రూ యువ కేంద్ర ప్రతినిధి మచ్చ రాజు, సీనియర్ అసిస్టెంట్ వేణుగోపాల్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సంతోష్ కుమార్, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ భాస్కర్, ఎఫ్ఆర్ఓ రవికృష్ణ, దివ్య, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎస్ ప్రవీణ్ కుమార్, పాల్గొన్నారు.

# అన్నదానం మహాదానం : కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి ఝాన్సీ రెడ్డి



వరంగల్ వాయిస్, తొర్రూరు : అన్నదానం మహాదానమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ నేత హనుమాండ్ల తిరుపతిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని మున్సిపల్ 2వ వార్డు కౌన్సిలర్ తూనం రోజా ప్రభుదాస్, యువజన నేత తూనం శ్రావణ్ కుమార్ ల ఆధ్వర్యంలో శుక్రవారం డివిజన్ కేంద్రంలో కేక్ కట్ చేసి మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఝాన్సీ రెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టినరోజు ప్రతి ఒక్కరికి ప్రత్యేకమని, సేవా కార్యక్రమాలు నిర్వహించి పుట్టినరోజు ప్రత్యేకత చాటుకోవాలన్నారు. సుమారు వెయ్యి మందికి అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టిన శ్రావణ్ కుమార్ ను ఝాన్సీ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ టీపీసీసీ సభ్యుడు కేతిరెడ్డి నిరంజన్ రెడ్డి, సీనియర్ నాయకులు పెదగాని సోమయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, కౌన్సిలర్లు భూసాని రాము, నర్మాటి గజానంద్, మహిళా అధ్యక్షురాలు బూర్గుల ప్రశాంతి, కాంగ్రెస్ నాయకులు చిత్తలూరి శ్రీనివాస్, అచ్చిరెడ్డి, నరేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, అశోక్ రెడ్డి, కొమరయ్య, ధరావత్ సోమన్న, జలకం శ్రీనివాస్, విజయ పాల్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, సోమిరెడ్డి,మహేందర్, వెంకన్న యాదవ్, రామ్మూర్తి యాదవ్, నర్సయ్య, ముదసాని సురేష్ శ్రీనివాస చారి, రవి నాయక్, రాయపల్లి రాజు, ప్రహ్లాదర్, లక్ష్మణ్, సురేందర్, తండా రవి, లింగన్న గౌడ్, భిక్షం నాయక్, మనోహర్, రాజేష్ యాదవ్, భరత్, హరికృష్ణ, అభిరామ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే ముందడుగు సాధ్యం

### మధ్యప్రదేశ్ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ పరికిపండ్ల నరహరి




వరంగల్ వాయిస్, హనుమకొండ : విద్యతోనే ముందడుగు సాధ్యమని, విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, చదువు అనే నిచ్చెనతో ఎంత ఎత్తుకైనా ఎదగవచ్చునని విద్యార్థులు ఇటువంటి ప్రేరణ కార్యక్రమాలను సద్వినియోగపరుచుకోవాలని మధ్యప్రదేశ్ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ పరికిపండ్ల నరహరి అన్నారు. శుక్రవారం హనుమకొండ, నయీంనగర్ ప్రాంతంలోని ఆదర్శ కాలనీలో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని 10వ తరగతి విద్యార్థులకు మూడు నెలల పాటు నిర్వహించే రాష్ట్రవ్యాప్త ప్రేరణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమ రూపకర్త సైకాలజిస్ట్ ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థుల ఫలితాలను పెంపొందించుటకు పరీక్షల్లో విజయం సాధించాలంటే అనే అంశంపై ఉచితంగా ప్రేరణ సదస్సులు నిర్వహించనున్నామని, విద్యార్థులు, సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు సద్వినియోగపరచుకోవాలని కోరారు. వివరాలకు ఫోన్ నెంబర్ 9989310141లలో సంప్రదించాలని తెలిపారు. అనంతరం అతిథులు కార్యక్రమ పోస్టర్లు, బ్యానరు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సహజ, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పరికిపండ్ల వేణు, పర్యాటకశాఖ మేనేజర్ డాక్టర్ సూర్య కిరణ్ , సైకాలజిస్ట్ లు పాగాల రాజయ్య, ఆడెపు రామకృష్ణ, డాక్టర్ రాజేంద్రప్రసాద్, ఆడ సుధాకర్, జన అధికార సమితి నాయకులు రామ్, లక్ష్మణ్, సీనియర్ సిటిజన్స్ ఫోరం నాయకులు తేరాల యుగంధర్, బేతి వెంకటేశ్వర్లు, బీజేపీ నాయకులు గాజుల సంపత్ కుమార్, రవీందర్ ఉపాధ్యాయ బృందం దామోదర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## కాజీపేటలో మహిళ హత్య

వరంగల్ వాయిస్, కాజీపేట : కాజీపేట రహమత్ నగర్ ప్రాంతానికి చెందిన కన్నె వీర అశోక్ తల్లి కన్నె విజయ గురువారం గుర్తు తెలియని దుండగులు హత్య చేశారు. రోజు మాదిరిగానే టిఫిన్ చేసి ఇంటి నుంచి బయటకు వెళ్లిందని, సాయంత్రం 5 అయిన కూడా ఇంటికి రాకపోయే సరికి కొడుకు గల్లీలో ఉన్న ఆమె స్నేహితుల వద్దకు వెళ్లి అడుగగా మామిడాల కొండమ్మ అనే గృహిణి తన వద్దకు 10.30 గంటలకు వచ్చి ఒక గంట తర్వాత ఇంటికి వెళ్లిపోతున్నానని చెప్పినట్లు తెలిపిందన్నారు. వీరికి అనుమానం వచ్చి ఆమె గురించి చుట్టుపక్కల గల్లీలో, స్నేహితుల వద్ద, చుట్టాల వద్ద అనేక ప్రదేశాలలో వెతికినప్పటికీ జాడ తెలియ రాలేదనీ తెలిపారన్నారు. మరుసటి రోజు రాత్రి 12:30 గంటల వరకు వెతికారు. తర్వాత వారి ఇంటికి వెళ్లి కూర్చొని ఉండగా సుమారు శుక్రవారం తెల్లవారుజామున 2గంటల సమయంలో వాళ్ల గల్లీలో కుక్కలు బాగా మొరుగుతుండగా కొడుకు, అతని భార్య కుక్కలు మొరుగుతున్న వైపు వచ్చి చూడగా, డబ్బా టాకీస్ గల్లీలో దోలి మల్లయ్య ఇంటి వెనక దర్వాజ దగ్గర ఒక మనిషి పడి ఉండి కనిపించగా, వీరు పరిగెత్తికెళ్లి చూడగా విజయ అక్కడ పడి తల వెనకాల తీవ్రమైన రక్త గాయంతో, కుడిచేతి మధ్య వేలు పగిలి ఉండి రోడ్డుపై రక్తపు మడుగులో పడి చనిపోయి ఉందని తెలిపారన్నారు. ఆమె శరీరంపై ఉండే రెండున్నర తులాల బంగారు ఆభరణాలు కూడా కనిపించలేదన్నారు. ఈమెను ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు, ఆమెపై ఉన్న బంగారు వస్తువులను దోచుకొని చంపి రోడ్డుపై పడేసి వెళ్లిపోయారని కొడుకు అశోక్ ఫిర్యాదు మేరకు కాజీపేట ఇన్ స్పెక్టర్ సార్ల రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# మా అమ్మ లేకపోతే.. నేను ఉండేవాడిని కాదు

## ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్ బిద్యాధర్



**వరంగల్ వాయిస్, నిట్ వరంగల్ :** స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, నిట్ వరంగల్ శుక్రవారం సెమినార్ హాల్స్ కాంప్లెక్స్‌లోని రామన్ హాల్‌లో "ఫిసికల్ అండ్ సైకలాజికల్ ఇస్సువెస్ ఇన్ విమెన్ మనగెమెంత్ అఫ్ రిస్క్స్ అండ్ చల్లెన్గ్స్ ఫస్ట్ బిఫోర్, దూరింగ్, అండ్ పోస్ట్పార్ట్యూమ్ పీరియడ్" అనే అంశంపై ఒక రోజు సెమినార్‌ను నిర్వహిస్తున్నాయి. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్.గ్లోరీ స్వరూప, ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి అతిథులుగా హాజరయ్యారు. మహిళల్లో శారీరక, మానసిక సమస్యలపై దృష్టి సారించి మహిళల కోసం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జాతీయ మహిళా కమిషన్, న్యూఢిల్లీ స్పాన్సర్ చేసింది. డాక్టర్ ఎస్.గ్లోరీ స్వరూప మహిళల ఆరోగ్యం, కుటుంబానికి మహిళలు అందించే తోడ్పాటు గురించి ఇంకా ఆమె ఆరోగ్య సమస్యలతో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లపై మాట్లాడారు. అనంతరం ఈ కార్యక్రమంలో ప్రొ.బిద్యాధర్ సుబుధి మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం పట్ల మనందరికీ అపారమైన గౌరవం ఉందని అన్నారు. భవిష్యత్తులో కూడా ఎన్ఐటీ వరంగల్‌లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తుండటం సంతోషంగా ఉందన్నారు. "మా అమ్మ లేకపోతే నేను ఈ రోజు ఉండేవాడిని కాదు", అని గుర్తు చేసుకున్నారు. మహిళల ఆరోగ్యంపై రోజంతా ఐదు సెషన్లు నిర్వహించారని తెలిపారు. అనంతరం స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ హెడ్ వి.రమాదేవి, హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ డిపార్ట్‌మెంట్ ఇన్‌ఛార్జ్ హెడ్ ప్రొఫెసర్ రాజా విశ్వనాథన్ కు స్వాగతం పలికారు. ఒకరోజు సదస్సుకు ప్రొఫెసర్ ఎస్.ఎల్.తులసీదేవి, ప్రొఫెసర్ కె.మాధవి, డా.టి.రాహుల్ సమన్వయం చేస్తున్నారన్నారు. ఒకరోజు సెమినార్ కార్యక్రమం లో దాదాపు 170 మంది మహిళా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఐకేపీ సెంటర్‌ను సందర్శించిన జాయింట్ కలెక్టర్



**వరంగల్ వాయిస్, కాటారం:** శంకరం పల్లి, ధన్వాడ ఐకేపీ సెంటర్లలో వడ్ల కొనుగోలు ఆలస్యమవుతున్న నేపథ్యంలో తెలంగాణా రాష్ట్ర ఐటీ పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు శుక్రవారం ఐకేపీ సెంటర్ లను జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు సందర్శించారు. చివరి గింజ వరకు కొంటామని, ప్యాడి పట్టిన తరువాత ఎటువంటి కటింగ్ లేకుండా కొనుగోలు చేస్తామని అన్నారు. తూకం లేకుండా రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తామని, రైస్ మిల్లర్లతో మాట్లాడి త్వరతగతిన ఐకేపీ సెంటర్ యంత్రాంగం సాయంతో కొనుగోలు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. శంకరం పల్లి, ధన్వాడ సర్పంచులు అంగజాల అశోక్ కుమార్, జంగిలి నరేష్, పీఏసీఎస్ సీఈఓ ఎడ్ల సతీష్, ఉప సర్పంచ్ ముక్కెర రమ్య శ్రీ తిరుపతి, బొనగిరి శ్రీకాంత్, బొడిగ రాజీర్‌గౌడ్, పోత ముక్తేష్, సిబ్బంది, రైతులు, హమాలీలు పాల్గొన్నారు.

# వృద్ధులకు ఉచిత ఆరోగ్య శిబిరం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మొబైల్ మెడికేర్ యూనిట్, హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రోంగోపాలపురం (రంగశాయిపేట్) గ్రామం ఎలగందుల వృద్ధాశ్రమంలో 60సంవత్సరాలు పైబడిన వయోవృద్ధలకు ఉచిత ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ఆరోగ్య శిబిరాన్ని ఎంఎంయూ స్టేట్ కో ఆర్డినేటర్ స్వర్ణలత సందర్శించి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం డిపార్ట్మెంట్ ఆఫ్ ఎంపవర్ మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసెబిలిటీస్, సీనియర్ సిటిజన్స్, భారత ప్రభుత్వ సహాకారంతో వయో వృద్ధులకు ఇంటి వద్దనే సేవలనందించేందుకు హనుమకొండ రెడ్ క్రాస్ సంచార వైద్యశాల సేవలు ద్వారా ప్రతి నెల మీ గ్రామానికి వచ్చి ఆరోగ్య శిబిరం నిర్వహించి వృద్ధులకు బీపీ, షుగర్ రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించటం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆరోగ్య శిబిరాలు నిర్వహించడంలో రాష్ట్ర స్థాయిలో హనుమకొండ రెడ్ క్రాస్ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని, ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యుల సేవలను కొనియాడారు. ఈ ఆరోగ్య శిబిరంలో హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి.విజయచందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, జిల్లా పాలకవర్గ సభ్యులు డాక్టర్ సీహెచ్.సంధ్యారాణి, రెడ్ క్రాస్ డాక్టర్లు జె.కిషన్ రావు, డాక్టర్ టి.మదన్ మోహన్ రావు, ఎలగందుల లక్ష్మీనారాయణ, రెడ్ క్రాస్ సిబ్బంది గుల్లెపెల్లి శివకుమార్, సాగర్, అరుణ్ కుమార్, కేశోజు రమేష్, పోశాలు, వృద్ధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా స్థాపన, పురస్కార వితరణ దినోత్సవం



**వరంగల్ వాయిస్, కడిపికొండ :** కాజీపేట పట్టణం, కడిపికొండలోని కేంద్రీయ విద్యాలయంలో సంఘటన స్థాపన, వరంగల్ కేంద్రీయ విద్యాలయం వార్షిక పురస్కార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ములుగు జిల్లా ఎస్పీ ఎస్ హెచ్.గౌస్ ఆలమ్ హాజరై ప్రథమంగా గౌరవ వందనం స్వీకరించి, జ్యోతి ప్రజ్వలన గావించారు. అనంతరం ప్రిన్సిపల్ పి.సుభాషిణి స్వాగతోపన్యాసం చేశారు. తదుపరి విద్యార్థులతో యూత్ పార్లమెంట్ నిర్వహించి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ లో భాగంగా తెలంగాణ రాష్ట్రానికి కో పార్ట్ నర్ రాష్ట్రం హర్యానా రాష్ట్రం కాబట్టి, ఆ రాష్ట్రానికి సంబంధించిన పాటలు, నృత్యాలు జాతీయ సమైక్యత వ్యత్యాసాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి గౌస్ ఆలమ్ మాట్లాడుతూ తాను కూడా కేవీ స్టూడెంట్ అని, కేవీలో చదివే ప్రతి విద్యార్థి కళలు, క్రీడలలో, అన్ని రంగాల్లో అద్భుతమైన ప్రతిభ పెంపొందించుకొని విజయాలు సాధిస్తారనీ ఆకాంక్షించారు. ఈ సంవత్సరానికి గాను అశోక సదనం రన్నర్ గాను, శివాజీ సదనం విన్నర్ గాను నిలిచారు. విజేతలకు పురస్కారాలు అందించారు. విద్యాలయ సీనియర్ అధ్యాపకురాలు స్మిత టప్లే ధన్యవాదాలు ఉపన్యాసం గావించి కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో విద్యాలయ సీసీఏ కోఆర్డినేటర్ కవిత సంగీత, అధ్యాపకులు శ్రీనివాస్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేషన్ అధికారులు న్యాయం చేయాలి

## బాధితురాలు సులోచన



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కార్పొరేషన్ అధికారుల పనితీరుతో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అన్ని ఉన్న ఏమీ లేదని తప్పుడు సమాచారం ఇస్తూ సమస్యను తప్పుదారి పట్టిస్తున్నారని బాధితురాలు తూముల సులోచన అధికారుల పై మండిపడ్డారు. శుక్రవారం హనుమకొండ రెడ్డి కాలనీకి చెందిన సులోచన మాట్లాడుతూ 2015 సంవత్సరంలో నా ఇంటి సరిహద్దు దాటి రవీందర్ అనే వ్యక్తి వచ్చి ఇంటి నిర్మాణం చేశారంటూ మున్సిపల్ అధికారులకు సమస్యను తెలియజేశామన్నారు. అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేసినా ఏండ్లు గడుస్తున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల చేతి వాటంతో రవీందర్ తో కుమ్మక్కై మా కుటుంబం పై తప్పుడు కేసులు పెట్టించి, గుర్తు తెలియని వ్యక్తులతో నా ఇంటిపై మాపై దాడి చేస్తున్నారన్నారు. తమ పక్క ఇంటికి ఎలాంటి పర్మిషన్ లేకుండా ఇంటి నిర్మాణం చేసినా ఆ యజమానికి కార్పొరేషన్ సిబ్బంది సహకరించడంపై మండిపడ్డారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకొని మా సమస్య పరిష్కరించాలని ఆమె కోరారు.

# రైతులకు అవగాహన సదస్సు



**వరంగల్ వాయిస్, పరకాల :** కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం పరకాల వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏవీపీ సూర్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వరి పంట సంపూర్ణ రక్షణ మెరుగైన దిగుబడికి రైతులకు తగు సూచనలు చేశారు. వరి పంటలో విత్తనాలు విత్తినప్పటి నుంచి కోత కోసే వరకు వాడుకోవాల్సి ఫర్టిసైడ్స్ మూడు రోజులలోపు గ్జెంజా, కలుపు ప్రారంభ దశలో పైలెట్, కాండం తొలిచే పురుగు ఫోర్ నాక్స్ జీఆర్, సుడి దోమలు అశ్ర, కాటిక తెగులుకు జేటాయు వంటి మందులు వాడుకుంటే రైతులకు మేలైన దిగుబడి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ మనేజర్ భరత్, ఏరియా మార్కెటింగ్ మేనేజర్ రాకేష్, పరకాల టేరిటరి మేనేజర్ భిక్షపతి, ఎండీఓ అజయ్, ఫీల్డ్ ఆఫీసర్ వినీల్, రాజు పాల్గొన్నారు.

# ముదిరాజ్ బిడ్డకు మంత్రి పదవి ఇవ్వాలి

## మెపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో మెపా-ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ ముదిరాజ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి మెపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ ఎన్నికల్లో 60లక్షల ముదిరాజ్ ల ప్రతినిధిగా నారాయణపేట జిల్లాలోని మక్తల్ నుంచి గెలిచిన ఒక్కగానొక్క ముదిరాజ్ బిడ్డ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముదిరాజ్ కు తప్పకుండా ఏదైనా మంత్రి పదవి ఇవ్వాలని, అలాగే ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశమైన ముదిరాజ్ లని బీసీ-డీ నుండి బీసీ-ఏ లోకి మారుస్తామని అలాగే ప్రత్యేక కార్పోరేషన్ కూడా ఏర్పాటు చేస్తామని చెప్పడం జరిగింది. కాబట్టి ఇచ్చిన హామీని నిలబెట్టుకొని, యావత్ తెలంగాణ రాష్ట్రంలోని ముదిరాజ్ లు అందరూ ఈ ప్రభుత్వానికి రుణపడి ఉంటారని తెలిపారు. గతంలో 2009లో కూడా వైఎస్ రాజ శేఖర్ రెడ్డి ముదిరాజ్ లను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మారుస్తూ జీవో 15 ఇచ్చినా కూడా కొన్ని అనివార్య కారణాలతో కోర్టు కేసుల వలన అది ఆగిపోయిందన్నారు. ఇప్పుడు అధికారం లోకి వచ్చినది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే కాబట్టి ఇచ్చిన హామీలను ఈ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని మెపా యావత్ ముదిరాజ్ జాతి కోరుకుంటుందని పులి దేవేందర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పరపల్లి గ్రామ కుల పెద్ద మనిషి చిరబోయిన భిక్షపతి, నిమ్మనబోయిన రమేష్, గ్రామ సొసైటీ అధ్యక్షుడు చెలకలపెల్లి పెద్ద వీరస్వామి, ప్రధాన కార్యదర్శి ఈర్ల పెద్ద రమేష్, ఉపాధ్యక్షుడు ఈర్ల చిన్న రమేష్, డైరెక్టర్స్ బండారు కృష్ణ, ఈర్ల ఐలుమల్లు, అజేందర్, రాంబాబు, ఈర్ల ఐలుమళ్లు, చెలకల పెల్లి ఐలుమల్లు, మెపా అండ్ ముదిరాజ్ సభ్యులు పులి చేరాలు, భిక్షపతి, చెలకలపెల్లి రమేష్, ఈర్ల అనిల్, రాకేష్, అనిల్, శివ, పులి రాజ్ కుమార్, అరవింద్ రాజ్ కుమార్ ముదిరాజ్ లు పాల్గొన్నారు.



# నా 21 ఏళ్ల కెరీర్‌లో బెస్ట్ డైరెక్టర్

## ప్రశాంత్ నీల్‌పై ప్రభాస్ కామెంట్స్

గ్లోబల్ స్టార్ హీరో ప్రభాస్ కాంపౌండ్ నుంచి వస్తున్న మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్ట్ సలార్ యాక్షన్ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ మూవీకి కేజీఎఫ్ ఫేం ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్నాడు. సలార్ రెండు పార్టులుగా రానుండగా.. తొలిపార్ట్ డిసెంబర్ 22న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. రిలీజ్ డేట్ తేదీ పడుతున్న నేపథ్యంలో ఏదో ఒక అప్‌డేట్ ఇస్తూ అభిమానులను ఖుషీ చేస్తున్నారు మేకర్స్. సలార్ మరో వారంలో సందడి చేయనుండటంతో ప్రభాస్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన మాటలు తెగ వైరల్ అవుతున్నాయి. కేజీఎఫ్ డైరెక్టర్ గురించి మాట్లాడుతూ.. ప్రశాంత్ నీల్ నా 21 ఏండ్ల కెరీర్‌లో ఉత్తమ డైరెక్టర్ అని చెప్పుకొచ్చాడు. గత 21 ఏండ్లలో నాకు ఒక్కసారి కూడా ఇలాంటి ఆలోచన రాలేదు. కేవలం నెలలోనే మేమిద్దరం చాలా క్లోజ్ అయ్యాం. ప్రశాంత్‌నీల్‌తో భారీ కమర్షియల్ సినిమా చేస్తున్నానని చెప్పాడు ప్రభాస్.

### సలార్‌లో ఆసక్తి కలిగిస్తున్న జాంబీ ఫైట్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న తాజా చిత్రం సలార్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రానున్న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 22న విడుదల కానుంది. మలయాళ స్టార్ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఇక ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదల చేసిన ట్రైలర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ఇదిలా ఉంటే.. తాజాగా ఈ సినిమా నుంచి ఒక సాలిడ్ రూమర్ బయటకు వచ్చింది. ఈ సినిమాలో ఒక జాంబీ ఫైట్ ఉందని తెలుస్తుంది. వందలాది జాంబీలు మూకుమ్మడిగా కలిసి దేవ మీద దాడి చేస్తే.. వాటిని ప్రభాస్ ఊచకోత కోస్తాడని.. ఈ ఒక్క సీక్వెన్స్ సలార్ సినిమాకే హైలెట్‌గా ఉంటుందని ఈ మూవీకి డబ్బింగ్ చెప్పిన టాలీవుడ్ సీనియర్ నటుడు తెలిపాడు. దీంతో అసలు ప్రశాంత్ నీల్ ఏం ప్లాన్ చేశాడో అన్న ఊహే గూస్ బంప్స్ తెప్పిస్తుంది. ఇక ఈ సీన్ వల్లే సినిమాకు ఎ సర్టిఫికేట్ వచ్చినట్లు సమాచారం. ఇక దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతుంది. మరోవైపు ఇటీవలే సలార్ ఫస్ట్ సింగిల్ సూరీడే లిరికల్ వీడియో సాంగ్‌ను మేకర్స్ విడుదల చేసిన విషయం తెలిసిందే. సూరీడే గొడుగు పట్టి.. వచ్చాడే భుజం తట్టి చిమ్మ చీకటిలో నీడలా ఉండెటోడు.. అంటూ సాగుతున్న ఈ పాట సలార్, వరద రాజ మన్నార్ స్నేహం నేపథ్యంలో సాగుతూ సినిమాపై అంచనాలు పెంచేస్తుంది. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేసిన సూరీడే లిరికల్ వీడియో సాంగ్ నెట్టింట వ్యూస్ పంట పండిస్తూ.. టాక్ ఆఫ్ ది టౌన్ నిలుస్తోంది. సలార్‌లో శృతిహాసన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోండగా.. జగపతిబాబు, బాబీ సింహా, ఈశ్వరీ రావు, శ్రియారెడ్డి, జాన్ విజయ్, సప్తగిరి, సిమ్రత్ కౌర్, పృథ్వీరాజ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. సలార్‌లో శృతిహాసన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోండగా.. జగపతిబాబు, బాబీ సింహా, ఈశ్వరీ రావు, శ్రియారెడ్డి, జాన్ విజయ్, సప్తగిరి, సిమ్రత్ కౌర్, పృథ్వీరాజ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు.




పాపులర్ యాంకర్ సుమ కుమారుడు రోషన్ హీరోగా ఎంట్రీ ఇస్తున్న చిత్రం బబుల్‌గమ్ . రవికాంత్ పేరెపు దర్శకత్వంలో వస్తోన్న ఈ చిత్రంలో మానస చౌదరి హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పటికే లాంఛ్ చేసిన బబుల్‌గమ్ ప్రీ లుక్ పోస్టర్, సాంగ్స్, టీజర్‌కు మంచి స్పందన వస్తోంది. నా డెస్టినీలో ఏం రాసిపెట్టిందో నాకు తెల్వదు. కానీ నచ్చినట్టు మార్చుకుంటా.. కావాల్సింది లాక్కొని తెచ్చుకుంటా.. అంటూ హీరో చెప్పే డైలాగ్స్ షురూ అయింది ట్రైలర్. ఎవడు పడితే వాడు చేతులేశాడనుకో.. చేతులు నరికేస్తానంటున్నాడు రోషన్. హీరోహీరోయిన్ల డిఫరెంట్ లవ్ ట్రాక్‌తో సాగుతున్న ట్రైలర్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. ప్రేమ బబుల్ గమ్ లాంటిది.. మొదట్ల తీయగుంటది.. తర్వాత అంటుకుంటది.. షూస్ కింద, థియేటర్లల్ల సీట్ల కింద అంత ఈజీ కాదురరేయ్ పండవెట్టేస్తది.. అంటూ సాగే డైలాగ్స్‌తో సాగుతున్న బబుల్ గమ్ టీజర్ సినిమాపై అంచనాలు పెంచుతోంది. బబుల్‌గమ్‌లో ప్రీ లుక్ పోస్టర్‌లో హీరోహీరోయిన్లు సూపర్ రొమాంటిక్ మూడ్‌లో సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ చిత్రానికి శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తుండగా.. క్షణం, కృష్ణ అండ్ హిజ్ లీల సినిమాల తర్వాత రవికాంత్ పేరెపు దర్శకత్వంలో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు బాగానే ఉన్నాయి. ఈ చిత్రం డిసెంబర్ 29న థియేటర్లలో సందడి చేయనుంది. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ–మహేశ్వరి మూవీస్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి.

# పాట రగడ

## రామజోగయ్యను ఆడుకున్న నెటిజన్లు

'గుంటూరు కారం'కు సంబంధించి మొదట విడుదలైన 'థమ్ మసాలా' సాంగ్ అందరినీ అలరించింది. అదే ఊపులో సెకండ్ సింగిల్‌కు సంబంధించి విడుదలకు ముందు చేసిన హడావుడి.. సాంగ్‌పై భారీగా అంచనాలను పెంచేసింది. తీరా.. సాంగ్ విడుదలైన తర్వాత ఫ్యాన్స్ అంతా నిరాశకు లోనవుతున్నారు. థమన్ మ్యూజిక్, రామజోగయ్య శాస్త్రి సాహిత్యం.. ఏదీ ఫ్యాన్స్‌కు నచ్చలేదు. అంతే సోషల్ మీడియా వేదికగా.. థమన్‌ని, రామ్‌జోని ఫ్యాన్స్ ట్రోలింగ్ మొదలెట్టారు. ఈ ట్రోలింగ్‌పై అసహనం వ్యక్తం చేసిన రామజోగయ్య శాస్త్రిని మరింతగా ఫ్యాన్స్ టార్గెట్ చేయడంతో చేసేది లేక.. వాస్తవానికి 'ఓ మై బేబీ' అంటూ మహేష్ బాబు, శ్రీలీల మద్య వచ్చిన ఈ పాటలో.. సూపర్ స్టార్ గత సినిమాలకు లింక్ అయ్యేలా రామజోగయ్య సాహిత్యాన్ని అల్లారు. కానీ ట్యూన్ క్యాచీగా లేకపోవడంతో.. లిరిక్స్ కూడా పెద్దగా శ్రోతలకు ఎక్కలేదు. . ఆ ఇంగ్లీష్ పదాలేంటి? హీరో ఎవరని అనుకుంటున్నారు ఇంత చెత్త పాట ఇంత వరకు వినలేదు అంటూ ఫ్యాన్స్ సోషల్ మీడియా వేదికగా భగ్గుమన్నారు. ఫ్యాన్స్ చేస్తున్న ట్రోలింగ్‌పై స్పందించిన రామజోగయ్య శాస్త్రి.. ప్రతివాడూ మాట్లాడే వాడే... రాయి విసిరే వాడే. అభిప్రాయం చెప్పేదానికి ఒక పద్ధతి ఉంటుంది. తెలుసుకుని ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడండి అంటూ ఫ్యాన్స్‌కి వార్నింగ్ ఇచ్చినట్లుగా ట్విట్టర్ ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. రామజోగయ్య శాస్త్రిపై నెటిజన్లు ఒక రకంగా యుద్ధమే మొదలెట్టారు. ఈ యుద్ధాన్ని తట్టుకోవడం రామ్‌జో వల్ల కాలేదు. అందుకే 'మీకో దండంరా నాయనా' అనేలా ట్విట్టర్ అకౌంట్ మూసేసి.. ముగింపు పలికారు.



# పడిపూజలో సీపీ అంబర్ కిషోర్ ఝా



**వరంగల్ వాయిస్, కాజీపేట :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 47 డివిజన్ బాలాజీ నగర్ లో కానిస్టేబుల్ తేజావత్ కవిత నవీన్ ఆధ్వర్యంలో వారి స్వగృహంలో శుక్రవారం నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమానికి వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ముఖ్యఅతిథిగా హాజరై అయ్యప్ప పూజను నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భక్తి భావం కలిగిన వారే అయ్యప్ప మాల ధరించాలన్నారు. ఉదయం, రాత్రి చల్లని నీటితో స్నానం చేయడం అలాగే ఒక పూట భోజనం చేయడం లాంటి చాలా విషయాలు తెలుపుతూ, భక్తిశ్రద్ధలతో ఉండాలని సూచించారు. పడిపూజ ప్రాంగణమంతా అయ్యప్ప శరణు ఘోషలతో మారు మ్రోగింది. అనంతరం కానిస్టేబుల్ నవీన్ మాట్లాడుతూ సీపీ పడిపూజలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ పడిపూజ కార్యక్రమంలో గురుస్వాములు జనార్ధన్, యాకయ్య, పిల్లల కుమారస్వామి, విజయ్ శ్రీధర్, భద్రారెడ్డి కాంతారావు, గిరిజాపతి, అయ్యప్ప స్వాములు, బాలాజీ నగర్ వాసులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.





# కుక్కలు కూడా వారి వెంట పడవు

## మాజీ ఎమ్మెల్యేలకు సెక్యూరిటీ అవసరం లేదు

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కల్లపల్లి రవీందర్ రావు హాట్ కామెంట్స్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ జిల్లాలో మాజీ ఎమ్మెల్యేలకు సెక్యూరిటీ అవసరం లేదు..కుక్కలు కూడా వారి వెంట పడవు అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కల్లపల్లి రవీందర్ రావు కామెంట్స్ వైరల్ గా మారాయి. వరంగల్ ఆత్మ గౌరవం ఉన్న జిల్లా..ఎర్రబెల్లి, సత్యవతికి మంత్రి పదవులు ఇస్తే ఉద్యమకారులు బాధ పడ్డారంటూ ఆయన తనలోని ఆవేదనను తెలియజేశారు. తెలంగాణ వాదం, ఉద్యమం తెలియని వారికి మంత్రి పదవి ఇస్తే ఎట్లా అంటూ ప్రశ్నించారు. అధినేత వాస్తవాలు వినే అవకాశం ఇస్తే ఎవరైనా చెబుతారన్నారు. వాస్తవాలు చెప్పే వారు బయట.. జోకుడుగాల్లు లోపల ఉంటే ఎలా వాస్తవాలు తెలుస్తాయన్నారు. ఖమ్మంలో ప్రతిసారి బయట గెలిచిన వారిని పార్టీలోకి తెచ్చుకుంటే నేతలు గ్రూపులుగా విడిపోయారంటూ ఆవేదన చెందారు. ఎర్రబెల్లిని మంచి లీడర్ అంటే ప్రజలు ఉరికించి కొడతారన్నారు. ఎర్రబెల్లికి చక్కిలి గింతలు పెట్టడం తప్ప ఎవ్వరికీ రూపాయి సహాయం చేయరంటూ మండి పడ్డారు. కొన్ని జిల్లాల్లో మా ఎమ్మెల్యేలు ప్రజలకు ఇరిటేషన్ తెప్పించారు. దానిని ఎలా మేనేజ్ చేయాలో పార్టీకి ప్లాన్ లేకపోతే ఎలా గెలుస్తామంటూ తన మనసులోని మాట చెప్పుకొచ్చారు.

# పన్ను వసూళ్లలో వేగం పెంచాలి

## గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్ భాషా



**వరంగల్ వాయిస్, వరంగల్ :** పన్ను వసూళ్లకు రోజువారి లక్ష్యాలను సాధించేందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్లాలని బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ భాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం పన్ను వసూళ్ల తీరును ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. హంటర్ రోడ్ లోని విశాల్ మార్ట్ సమీపంలో, నక్కలగుట్ట రెడ్ బస్ క్యాంటీన్ వద్ద, నక్కలగుట్ట వీఆర్ కే సిల్క్స్ సమీపంలో బిల్ కలెక్టర్లు, ట్రేడ్ వసూలు నిర్వహించే సిబ్బంది పనితీరును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పన్ను వసూళ్ల తీరును అడిగి తెలుసుకొని, సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పన్ను వసూళ్ల తీరు ఆశాజనకం లేదని, ఇటీవల సమావేశం ఏర్పాటు చేసి తగు సూచనలు చేసినప్పటికీ వసూళ్లలో ఎలాంటి పురోగతి లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించడంలో చిత్త శుద్ధి లోపించిందని, పని తీరు మారాలని, పన్నులు చెల్లించకపోతే నోటీసులు అందజేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఓ సుదర్శన్, శానిటరీ సూపర్ వైజర్ నరేందర్, ఆర్ ఓ రజని, బిల్ కలెక్టర్లు, జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

### సమన్వయం అవసరం..

జీడబ్ల్యుఎంసీకి సంబందించిన సమస్యలను పరిష్కరించడానికి వివిధ శాఖల సమన్వయం అవసరమని కమిషనర్ షేక్ రిజ్వాన్ భాషా అన్నారు. గ్రేటర్ పరిధిలోని ప్రభుత్వ భవనాలకు సంబంధించిన పన్నుల వసూళ్లు, వీధి వ్యాపారులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి పోలీసు, ట్రాఫిక్ వారి సహకారం అవసరమని, విద్యుత్ సరఫరాలో అవాంతరాలను నిరోధించడానికి ఎన్పీడీసీఎల్ వారి సహకారం అవసరం అన్నారు. అప్పుడు సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమీషనర్ అనిసుర్ రషీద్, సీఎంహెచ్ ఓ డాక్టర్ రాజేష్, సిటీ ప్లానర్ వెంకన్న, హన్మకొండ ఆర్ డీఓ రమేష్, డీసీపీ ప్రకాష్ రెడ్డి, ఏసీపీలు ఖలీల్, శ్రీనివాస్ రెడ్డి, ఈఈ సంజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాల్లో దివ్యాంగులకు ప్రాధాన్యం

## మూడో వారంలో ప్రత్యేక గ్రీవెన్స్

## జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల్లో దివ్యాంగులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడే, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి శారద, డీఆర్ డీఓ సంపత్ రావు, డీఎంహెచ్ ఓ వెంకటరమణ, డీసీపీ రవీందర్, దివ్యాంగుల కమిటీ మెంబర్ చక్రపాణి నర్సక్క తదితరులతో కలసి కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నెల మూడో శనివారం దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా గ్రీవెన్స్ ఏర్పాటు చేసి వారి సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోనున్నట్లు ప్రకటించారు. ఎంజీఎం ఆసుపత్రిలో దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ఓపీ కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వ పరంగా వివిధ పథకాలు, ఎకనామికల్ సపోర్ట్ స్కీమ్ లు ఉన్నాయని, బిజినెస్ పరంగా అవగాహన కలిగిన వారు దరఖాస్తు చేసినట్లయితే ప్రోత్సాహం అందిస్తామన్నారు. జిల్లాలో ప్రతి నెల రూ.6.19 కోట్లు వెచ్చించి 15,424 మంది దివ్యాంగులకు పెన్షన్లు అందిస్తున్నామన్నారు. సదరం సర్టిఫికెట్ల మంజూరులో జరిగిన అవకతవకలపై విచారణ నిర్వహించి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో వివిధ హోదాలలో ఉద్యోగులుగా ఉన్న దివ్యాంగుల ఆత్మాభిమానం దెబ్బతినకుండా చూసుకోవలసిన బాధ్యత జిల్లా అధికారులు, తోటి ఉద్యోగస్తులపై ఉందని కలెక్టర్ గుర్తు చేశారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ దివ్యాంగులు ఆత్మస్థైర్యం కోల్పోకూడదని అసెంబ్లీ ఎలక్షన్లలో దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ లో వారిచే విధులు నిర్వహించడం జరిగిందని గుర్తు చేశారు. దివ్యాంగుల చట్టం 2016 ను ఖచ్చితంగా అమలు చేయాలని దివ్యాంగుల కమిటీ మెంబర్ చక్రపాణి కోరారు. అనంతరం మల్లికాంభ మనో వికాసం కేంద్రం విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడల్లో 77 మంది విజేతలకు సర్టిఫికెట్స్ తో పాటు మెమొంటో ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందితో పాటు జిల్లాలోని దివ్యాంగుల కమిటీ మెంబర్లు దివ్యాంగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పేదలకు అండగా నిలిచాం..

## 10 మందికి పునరావాసం కల్పించాం

## శివానంద కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** పైడిపల్లి గ్రామంలోని పది మంది నిరుపేద కుటుంబాలకు శివానంద కల్చరల్ ట్రస్ట్ అండగా నిలిచిందని మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ ప్రకటించారు. వరంగల్ పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న పైడిపల్లి గ్రామంలో పలువురు నిరుపేదలకు చెందిన పది మందికి చెందిన పురాతన ఇల్లు కూలి పోవడంతో ఒక్కో ఇంటికి సుమారు లక్షన్నర కర్చు చేసి వాటిని ట్రస్ట్ పున:నిర్మించిందని ఆయన వెల్లడించారు. పుట్టి పెరిగిన ఊరిని కన్న తల్లిలా చూసుకోవాలన్న సంకల్పంతో ట్రస్టు తరఫున ఇలాంటి కార్యక్రమానికి శ్రీ కారం చుట్టామన్నారు. దీనిని ప్రతి ఒక్కరు ఒక యజ్ఞంగా స్వీకరించి పేదలకు సాయం చేయాలని త్రిపురనేని గోపీచంద్ కోరారు. ఇలాంటి కార్యక్రమాలతో గ్రామంలోని పేదలు నివసిస్తున్న ప్రాంతాల్లో వైశమ్యాలు తగ్గి పరస్పర సహాయ సహకారాలు మెరుగుపడతాయన్నారు. ఈ సందర్భంగా పైడిపల్లిలో కొత్తగా నిర్మాణం చేసిన ఇంటిని ముంజ రామస్వామి దంపతులకు అందజేశారు. అనంతరం గురుదేవులు శివానందమూర్తి 95 వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని గ్రామ ప్రజలందరికీ మహా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మరొక ట్రస్టీ బండారు సాయినారాయణ మాట్లాడుతూ ప్రతివారు ఉన్నంతలో సాయం చేస్తుంటే ఒక గింజ భూమిలో వేస్తే 100 గింజలు ఎలా ఇస్తుందో ఆ పుణ్యఫలం ప్రతి వాళ్ళకి లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీ మాదరపు సదా శివుడు, గందే ఉమాశంకర్, కొడిమెళ్ల విజయ్ కుమార్, గొస్కుల సుదర్శన్, జన్ను రంజిత్, ఎం.మునీర్ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com